
సాక్షి
ఒడిశా
శుక్రవారం । 11 । జూలై । 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు
భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం గురువారం లెక్కించారు. ఇందులో నగదు రూ.5,80,189లు, బంగారం 700 మిల్లీగ్రాములు, వెండి 41 గ్రాముల 500 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



తగ్గేది లేదు : డ్రైవర్లు
డ్రైవర్ల ఆందోళన కొనసాగుతోంది. దీనికి భయపడాల్సిన అవసరం లేదని మంత్రి అంటున్నారు.
- 8లో▸



ప్రభుత్వానికి లొంగిపొండి
మావోలు ప్రభుత్వానికి లొంగిపోవాలని పోలీసులు పిలుపునిచ్చారు. ఆదుకుంటామని అభయమిచ్చారు.
- 8లో▸

న్యూస్‌రీల్

ఎస్పీగా వెళ్లి డీఐజీగా రాక



కొరాపుట్: సదరన్ వెస్టర్న్ రేంజ్ డీఐజీగా కన్వర్ విశాల్ సింగ్‌ని నియమిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. విశాల్ గతంలో కొరాపుట్ ఎస్పీగా పని చేశారు. ప్రస్తుతం స్పెషల్ ఇన్వెస్టిగేషన్ వింగ్‌లో డీఐజీగా పని చేస్తున్నారు. మళ్లీ డీఐజీ హోదాలో కొరాపుట్ జిల్లా కేంద్రం రానునున్నారు. ప్రస్తుతం సదరన్ వెస్టర్న్ రేంజ్ డీఐజీగా ఉన్న అఖిలేశ్వర్ సింగ్ తిరిగి విశాల్ సింగ్ విధులు నిర్వర్తిస్తున్న ఇన్వెస్టిగేషన్ వింగ్ డీఐజీగా వెళ్తారని ప్రభుత్వం ప్రకటించింది. కన్వర్ విశాల్ సింగ్ కొరాపుట్‌లో ఎస్పీగా పనిచేసి తిరిగి అదే కొరాపుట్‌కి డీఐజీగా రావడం గమనార్హం.

దాతృత్వం చాటుకున్న శ్రీనివాసరావు



పేదలకు గొడుగులు, ఆహారం పంపిణీ చేస్తున్న దృశ్యం

కొరాపుట్: సామాజిక సేవకు సరిహద్దులు ఉండవని సామాజిక మాధ్యమాలు ఉంటే చాలని ఈ సంఘటన నిరూపించింది. ఆంధ్ర ప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలసలో పేదలకు నబరంగ్‌పూర్ జిల్లాలోని చైనా మార్కెట్‌కి చెందిన బీజేపీ మాజీ కౌన్సిలర్ కొత్తకోట శ్రీనివాసరావు వితరణ చేశారు. ఆమదాలవలసలో గత 526 రోజులుగా పేదలకు నిరవధికంగా ఉచిత మధ్యాహ్న భోజన వితరణ జరుగుతోంది. అయితే ఇటీవల భారీ వర్షంలో పేదలు ఆహారం తీసుకుంటున్న చిత్రం వెలుగులోకి వచ్చింది. ఇది చూసిన శ్రీనివాసరావు చలించారు. వెంటనే నిర్వాహకులతో మాట్లాడి పేదలందరికీ నాణ్యమైన గొడుగులు, ఒక రోజు ఆహారం, స్వీట్లు అందజేయాలని సూచించారు. అవసరమైన ఆర్థిక సాయం పంపించారు. సాయి భక్తుడైన శ్రీను గురు పౌర్ణమి సందర్భంగా 527 రోజు అక్కడి వారందరికీ గొడుగులు, ఆహారం పంపిణీ చేయించారు.

ఏసీఎఫ్ భార్యపై హత్య కేసు విచారణ కొనసాగాల్సిందే: హై కోర్టు

భువనేశ్వర్: ఏసీఎఫ్ సౌమ్య రంజన్ మహాపాత్రో మరణానికి సంబంధించి అతని భార్య బిద్యా భారతి పండా వ్యతిరేకంగా నమోదైన హత్యారోపణ కేసు విచారణ కొనసాగాల్సిందేనని రాష్ట్ర హై కోర్టు ఆదేశించింది. ఈ కేసుకు సంబంధించి పర్లాకిమిడి ఎస్‌డీజేఎం న్యాయ స్థానం ఆదేశించిన ప్రకారం ఈ కేసు విచారణ కొనసాగించాలని రాష్ట్ర హై కోర్టు స్పష్టం చేసింది. పర్లాకిమిడి ఎస్‌డీజేఎం న్యాయ స్థానం జారీ చేసిన ఆదేశాల్ని కొట్టివేయాలని నిందిత భార్య బిద్యా భారతి పండా రాష్ట్ర హై కోర్టుని ఆశ్రయించింది. ఆమె అభ్యర్థనని ఉన్నత న్యాయ స్థానం తిరస్కరించి తదుపరి విచారణ నిరాటంకంగా కొనసాగాలని ఆదేశించింది. నిందితురాలికి వ్యతిరేకంగా ఐపీసీ సెక్షన్లు 285, 304–ఎ కింద విచారణ కొనసాగుతుంది. 302, 120బి సెక్షన్లు కింద ప్రత్యేక ఫిర్యాదు ద్వారా లేవనెత్తిన ఆరోపణలపై విచారణను ప్రారంభ దశలో కొట్టివేయాలనే అభ్యర్థన పట్ల ఉన్నత న్యాయ స్థానం ప్రతికూలంగా స్పందించింది. ఈ సెక్షన్ల కింద లేవనెత్తిన ఆరోపణలపై సమగ్ర పరిశీలన విభిన్న వాస్తవ వివాదాలను ధృవీకరించే అవకాశం ఉందని రాష్ట్ర హై కోర్టు అభిప్రాయపడింది. తీవ్రంగా భిన్నమైన కథనాలు, వివాదాస్పద వాస్తవాల ఉనికిని దృష్టిలో ఉంచుకుని ట్రయల్ కోర్టు సాక్ష్యాలను లోతుగా పరిశీలించడం సముచితమని హై కోర్టు పేర్కొంది. హై కోర్టు జారీ చేసిన పరిశీలనల్ని ప్రభావితం చేయకుండా పిటిషనర్ (బిద్యా భారతి) ట్రయల్ కోర్టు ముందు విడుదల కోరడం వంటి అభ్యర్థనల్ని ప్రవేశ పెట్టేందుకు పూర్తి స్వేచ్ఛ కల్పించినట్లు ఉన్నత న్యాయ స్థానం వెసులుబాటు కల్పించింది.

దొంగను పట్టించిన ప్రజలు




దొంగ దొరికిన ఇంటిలో విచారిస్తున్న పోలీసులు

జయపురం: దొంగతనం చేసేందుకు ఒక ఇంటిలో చొరబడిన దొంగను ఆ ప్రాంత ప్రజలు చుట్టు ముట్టి పట్టుకొని పోలీసులకు అప్పజెప్పారు. ఈ సంఘటన జయపురం సబ్‌డివిజన్ బొరిగుమ్మ సమితి శాంతినగర్‌లో జరిగింది. బుధవారం రాత్రి ఒక దొంగ బొరిగుమ్మ శాంతినగర్ నివసిస్తున్న బులు పాఢీ ఇంటిలో ప్రహరీ దూకి ఇంటిలో దొంగతనం చేసేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో ఇంటి యజమాని భార్య శబ్దం విని తలుపు తెరిచి చూడగా దుండగుడు పారిపోవడానికి ప్రయత్నించాడు. ప్రహరీపై ఉన్న మేకులు గుచ్చుకోవడంతో ఒక మూల దాక్కున్నాడు. స్థానికులు అతడిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు.

రథాల విడి భాగాల విక్రయానికి..
సర్వం సిద్ధం



రథం పూర్తి స్వరూపం



ఆకట్టుకునే రథ చక్రాలు

భువనేశ్వర్: పూరీ శ్రీ జగన్నాథుని సంస్కృతి అపురూపం. భగవంతుడు ఆశీనుడైన రథం తాడు తాకిన జన్మ చరితార్థం అవుతుందని విశ్వసిస్తారు. యాత్ర సమయంలో రథం ఎంత ప్రాధాన్యత సంతరించుకుంటుందో యాత్ర తర్వాత అంత కంటే అధికంగా ప్రాధాన్యత కూడగట్టుకోవడం విశేషం. ఔత్సాహిక భక్తులు రథాల విడి భాగాల్ని కొనుగోలు చేసి నిర్ధారిత ప్రాంగణాల్లో అత్యంత పవిత్రంగా పదిలపరుస్తారు. నిత్యం ఈ విడి భాగాలకు నియమ నిష్టలతో పూజలు నిర్వహిస్తారు. శ్రీ మందిరం పాలక వర్గం (ఎస్‌జేటీఏ) వార్షిక రథ యాత్రలో వినియోగించిన రథాల విడి భాగాలు విక్రయించేందుకు తాజా ప్రామాణిక కార్యాచరణ విధానం (ఎస్‌ఓపీ) జారీ చేసింది. ఈ నేపథ్యంలో రథాల విడి భాగాల సవరించిన ధరల జాబితాను విడుదల చేసింది. విడి భాగాల్లో రథ చక్రాలకు విశేష ఆదరణ ఉంటుంది. ప్రధానంగా శ్రీ జగన్నాథ స్వామి నంది ఘోష్ రథం చక్రాలపై భక్తులు అధికంగా మక్కువ కనబరుస్తారు. తాజా ఎస్‌ఓపీ ప్రకారం శ్రీ జగన్నాథుని నందిఘోష్ రథ చక్రం ధర ఒక్కొక్కటి రూ. 3 లక్షలుగా నిర్ధారించారు. బలభద్రుని తాళ ధ్వజం ఒక్కో చక్రం ధర రూ. 2 లక్షలు, సుభద్ర దేవి దర్ప దళనం ఒక్కో చక్రం ధర రూ. 1.5 లక్షలుగా నిర్ణయించారు.
రథాలపై విడి భాగాలకు ధరలు నిర్ధారించారు. వాటిలో ఒక్కో ప్రభ ధర రూ. 25,000 కాగా ఇతర విడి భాగాల ధర ఒక్కొక్కటి రూ.15,000గా ప్రకటించారు. మూడు రథాల పూర్తి రథ చక్రాల సెట్‌ను కొనుగోలు చేయడానికి దాదాపు రూ. 6 లక్షలు వెచ్చించాల్సి ఉంటుంది.

సకాలంలో దాఖలు చేయాలి

ఆసక్తి గల రథాల విడి భాగాల కొనుగోలుదారులు ఈ ఏడాది సెప్టెంబర్ నెల 15 లోపు ఆలయ పాలక వర్గానికి (ఎస్‌జేటీఏ) దరఖాస్తు దాఖలు చేయాలి. దానితో పాటు రూ.1,000 దరఖాస్తు రుసుం చెల్లించాలి. తాజా నిబంధనల మేరకు కొనుగోలు కోసం ఎంపికైన దరఖాస్తుదారులకు సకాలంలో సమాచారం చేరవేస్తారు. ఈ సమాచారం అందిన ఒక వారం లోపు పూర్తి మొత్తాన్ని సూచించిన ఖాతాలో జమ చేయాలి. నిర్ణీత సమయంలోపు ఎంపికైన దరఖాస్తుదారుడు మొత్తాన్ని డిపాజిట్ చేయలేని పరిస్థితుల్లో తదుపరి అర్హత కలిగిన దరఖాస్తుదారుని పరిగణనలోకి తీసుకుని కొనుగోలు అవకాశం కల్పిస్తారు. ఈ వ్యవహారంలో పాదర్శకతకు పెద్ద పీట వేస్తున్నట్లు పాలక వర్గం ప్రకటించింది.
సాధారణంగా స్టార్ హోటళ్లు, కార్పొరేటు ఆస్పత్రులు, విమానాశ్రయాలు, ప్రభుత్వ రంగ సంస్థలు, పేరొందిన వర్గాలు, మఠాలు, ప్రముఖ దేవస్థానాలు పూరీ శ్రీ జగన్నాథుని రథం విడి భాగాల్ని ఉత్సాహంతో కొనుగోలు చేసి ఆలయ పాలక వర్గం నిబంధనలకు కట్టుబడి ఉంటామని వాంగ్మూలం ముందస్తుగా దాఖలు చేయాల్సి ఉంది. స్వామి వినియోగించిన ప్రతి సామగ్రి, వస్తువు అత్యంత పవిత్రమైనదిగా పరిగణిస్తారు. ఈ క్రమంలో రథాల విడి భాగాలు కొనుగోలు చేసిన వర్గాలు నిర్ధారిత స్థలంలో అత్యంత పవిత్రంగా పదిలపరచి నిత్యం ధూపదీపారాధన నిర్వహించాల్సి ఉంటుంది.

రాష్ట్రపతి పర్యటనకు సన్నద్ధత



మనోజ్ ఆహుజా అధ్యక్షతన రాష్ట్రపతి పర్యటన సన్నాహక సమావేశం

భువనేశ్వర్: భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ నెల 14, 15వ తేదీల్లో రెండు రోజుల రాష్ట్ర పర్యటనకు రానున్నారు. ఈ నేపథ్యంలో స్థానిక లోక్ సేవా భవన్‌లో ప్రభుత్వ ప్రముఖ కార్యదర్శి మనోజ్ ఆహుజా అధ్యక్షతన రాష్ట్ర స్థాయి సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అధికార యంత్రాంగం సన్నద్ధతని ఆయన సమీక్షించారు. రాష్ట్రపతి ఈ నెల 14వ తేదీ మధ్యాహ్నం న్యూ ఢిల్లీ నుండి స్థానిక బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయానికి ప్రత్యేక వైమానిక దళం విమానంలో చేరుతారు. భువనేశ్వర్, కటక్ జంట నగరాలలో 2 రోజుల పాటు వివిధ కార్యక్రమాలలో పాల్గొంటారు. ఈ నెల 14 సాయంత్రం స్థానిక అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ (ఎయిమ్స్) పంచమ స్నాతకోత్సవానికి రాష్ట్రపతి హాజరవుతారు. మర్నాడు 15వ తేదీ ఉదయం కటక్ రెవెన్షా విశ్వ విద్యాలయం 13వ వార్షిక స్నాతకోత్సవానికి హాజరవుతారు. ఆ తర్వాత కటక్ రెవెన్షా బాలికల ఉన్నత పాఠశాల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారు. తదుపరి రాష్ట్రపతి కటక్ తులసీ పూర్ బిజూ పట్నాయక్ చక్‌లో ఉన్న సరళ భవన్‌ను సందర్శించి ఆది కవి సరళా దాస్ విగ్రహం వద్ద శ్రద్ధాంజలి ఘటిస్తారు. సరళ సాహిత్య సంసద్ నిర్వహించే ఆది కవి సరళా దాస్ 600వ జయంతి కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరవుతారు. ఈ కార్యక్రమంలో కళింగ రత్న అవార్డు–2024ను ప్రదానం చేస్తారు. జూలై 15వ తేదీ సాయంత్రం న్యూ ఢిల్లీకి తిరిగి పయనం అవుతారు. రాష్ట్రపతిని విమానాశ్రయంలో ఘన స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేశారు. విమానాశ్రయం నుంచి ప్రత్యక్షంగా స్థానిక రాజ్ భవన్ చేరి రాష్ట్రపతి బస చేస్తారు. ఈ సందర్భంగా ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేయనున్నారు. కార్యక్రమాల వేదిక ప్రాంగణాలు, రోడ్డు ప్రయాణంలో దారి పొడవునా అత్యవసర భద్రత, రక్షణ ఏర్పాట్లు సమీక్షించారు. వేదికకు దారితీసే రోడ్ల తాజా స్థితిగతుల దృష్ట్యా అవసరమైన మరమ్మతులు, నిర్వహణ పనులు చేపట్టాలని ఆదేశించారు. రోడ్ల పరిశుభ్రత, వేదిక వద్ద నిరంతర విద్యుత్ సరఫరా, తగినంత సంఖ్యలో అదనపు జనరేటర్లను ఏర్పాటు చేయడానికి సూచనలు జారీ చేశారు. రాష్ట్రపతి సందర్శన సజావుగా సాగడానికి, వివిధ సన్నాహాలకు అవసరమైన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడంలో ప్రముఖ కార్యదర్శి అందరి సహకారాన్ని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర అభివృద్ధి కమిషనర్, ప్రభుత్వ అదనపు ప్రముఖ కార్యదర్శి అనూ గర్గ్, హోం శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి సత్యబ్రత్ సాహు, రాష్ట్ర పోలీస్ డైరెక్టర్ జనరల్ వైబీ ఖురానియా, సంబంధిత వివిధ విభాగాల కార్యదర్శులు, కేంద్ర రెవెన్యూ కమిషనర్లు, కటక్, ఖుర్దా జిల్లా కలెక్టర్లు, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

మత్స్యజీవి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ఏడీఎం ఫాల్గుని మఝి



ఉత్తమ రైతులను సత్కరిస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: రాష్ట్ర ప్రభుత్వం చేపల పెంపకందారులకు సబ్సిడీ అందించేందుకు తీసుకొచ్చిన ముఖ్య మంత్రి మత్స్యజీవి సంక్షేమ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అదనపు మాజిస్ట్రేట్ ఫాల్గునీ మఝి సూచించారు. స్థానిక మట్టి సంరక్షణ, వాటర్ షెడ్ విభాగం కాన్ఫరెన్సు హాల్‌లో నిర్వహించిన జాతీయ మత్స్యకారుల దినోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లాలో చేపల చెరువుల పెంపకం ద్వారా మహిళా స్వయం సహాయక గ్రూపులకు లాభదాయకంగా ఉంటుందని ఉద్యానవనాల శాఖ అధికారి శుశాంత్ కుమార్ దాస్ అన్నారు. గజపతి జిల్లాలో చేపల పెంపకం ఉత్పాదన గణనీయంగా ఇటీవల పెరిగిందని, ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీలు లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతులు తమ పొలాల్లో చేపలు, రొయ్యల చెరువులు తవ్వి ఆధునిక పద్ధతుల ద్వారా ఉత్పాదన పెంచాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యానవనాల శాఖ ఉపసంచాలకుడు డా.శుశాంత కుమార్ దాస్, వాటర్‌షెడ్ విభాగం ప్రాజెక్టు డైరెక్టర్ సురేష్ కుమార్ పట్నాయక్, సెంచూరియన్ వర్సిటీ అధ్యాపకులు అరవింద ఉపాధ్యాయ, జిల్లా ముఖ్య ప్రాణి చికిత్స అధికారి డా.బిద్యుత్ శేఖర్ మిశ్రా తదితరులు పాల్గొన్నారు.

శక్తిసదన్ గృహంలో బాలిక ఆత్మహత్య

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కేంద్రంలోని శక్తి సదన్ గృహంలో గురువారం ఓ 16 ఏళ్ల యువతి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మల్కన్‌గిరి జిల్లా కలిమెల సమితి ఎంవీ 81 గ్రామానికి చెందిన జైనిక అనే బాలిక తన గ్రామానికి చెందిన ఓ యువకుడిని ప్రేమించింది. కొద్ది రోజుల కిందట ఇద్దరూ పారిపోయారు. బాలిక తల్లిదండ్రులు మోటు పోలీసుస్టేషన్‌లో యువకుడిపై ఫిర్యాదు చేయగా పోలీసులు వారిని పట్టుకుని యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. బాలికకు 18 ఏళ్లు వచ్చే వరకు జిల్లా శక్తి సదన్ గృహంలో ఉంచుతామనగా తల్లిదండ్రులు అంగీకరించారు. కొన్ని నెలలుగా అక్కడే ఉంటున్న బాలిక తన తల్లికి నాలుగు రోజుల కిందట వంట వారు దౌర్జన్యం చేస్తున్నారని తెలిపింది. తాను వచ్చి మాట్లాడతానని ఆమె చెప్పగా.. బుధవారం రాత్రి అందరితో ఉన్న బాలిక గురువారం ఉదయానికి తన గదిలో ఉరి వేసుకుని కనిపించింది. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు తమ బిడ్డను హత్య చేశారని ఆరోపిస్తున్నారు. మల్కన్‌గిరి ఐఐసి రీగాన్‌కీండో సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి బాలిక మృతదేహాన్ని మల్కన్‌గిరి మార్చురీకి తరలించారు. శుక్రవారం పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని తల్లిదండ్రులకు అప్పగిస్తామన్నారు.

భారీగా గంజాయి స్వాధీనం



పట్టుబడిన గంజాయి బస్తాలు

పర్లాకిమిడి: జిల్లాలోని మోహనా బ్లాక్ అడవ పోలీసుస్టేషన్ పరిధిలో అంతరాబ గ్రామ పంచాయతీ రేణు గ్రామం వద్ద రోడ్డు పక్కన గంజాయి అక్రమంగా రవాణా చేస్తుండగా పోలీసులు పట్టుకున్నట్లు జిల్లా ఎస్పీ జ్యోతింద్రనాథ్ పండా తెలియజేశారు. పట్టుబడిన 12 గంజాయి బస్తాలను మోహనా తహసీల్దార్ సమక్షంలో తూకా వేయగా 12.63 క్వింటాళ్లుగా ఉన్నట్లు నిర్ధారించారు. అయితే గంజాయి అక్రమ రవాణాలో నిందితులు పరారైనట్లు తెలియజేశారు.
కొరాపుట్: మూడు వేర్వేరు సంఘటనల్లో 27 కేజీల గంజాయిని కొరాపుట్ పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. కొరాపుట్ జిల్లా నందపూర్ సమితి పంథాలుంగ్ గ్రామ పంచాయతీ జయంతి గిరి, చెటోడి పుట్ గ్రామాల్లో ఎక్సైజ్ సిబ్బంది దాడులు చేపట్టారు. ఈ దాడుల్లో గంజాయితో పాటు 12 లీటర్ల దేశీ మద్యం పట్టుబడింది. ఈ ఘటనలో సిర్మే ఖొరా, జయరాం పంగి, బల్కి పంగిలను అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ అన్నపూర్ణ రథ్ ప్రకటించారు. దీనం చేసుకున్న గంజాయితో పాటు నిందితులు

బెడిసికొట్టిన చర్చలు

భువనేశ్వర్: అఖిల ఒడిశా డ్రైవర్ల మహా సంఘం ప్రతినిధులతో రాష్ట్ర ప్రభుత్వం జరిపిన చర్చలు విఫలం అయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా రోడ్డు రవాణా సమ్మె గత 3 రోజులుగా నిరవధికంగా కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో స్థానిక ఖారవేళ భవన్ ఈ చర్చలు జరిగాయి. రాష్ట్ర రవాణా, వాణిజ్య శాఖ మంత్రి, విభాగం కమిషనర్, కార్యదర్శితో అఖిల ఒడిశా డ్రైవర్ల మహా సంఘం ప్రతినిధుల మధ్య సుదీర్ఘంగా 4 గంటల పాటు చర్చలు కొనసాగాయి. రాష్ట్రంలో రవాణా రహదారులపై విశ్రాంతి గదుల నిర్మాణం, వివిధ పరిశ్రమలలో ఒడిశా డ్రైవర్ల ఉపాధిపై విస్తృతంగా చర్చించారు. ఈ చర్చలకు ఒడిశా డ్రైవర్ల సంఘం అధ్యక్షుడు ప్రశాంత్ మెండులి హాజరు కానట్లు సమాచారం. డ్రైవర్ల డిమాండ్ల పట్ల ప్రభుత్వ సాధకబాధకాల్ని ఆందోళనకారుల మధ్య బహిరంగంగా ప్రకటించాలని పట్టుబట్టారు. ప్రభుత్వ అంగీకారం, హామీలు లిఖితపూర్వకంగా జారీ చేయాలని అభ్యర్థించారు.

• కరి విరామ సమయం



ఆహార అన్వేషణలో పగలంతా అడవి అంతా చుట్టు ముట్టి అలసి సొలసిన ఏనుగుల పరివారం పచ్చని పచ్చిక బీడుల మధ్య విరామం పొందుతున్న ఈ దృశ్యం అంగుల్ జిల్లా అటవీ ప్రాంతం మహాబిరోడ్ శ్రేణిలోని బ్రాహ్మణి నది ఒడ్డున కనిపించింది. గున్న ఏనుగుల గుంపు ఇలా విశ్రాంతి తీసుకుంటున్న దృశ్యం అబ్బురపరిచింది.

– భువనేశ్వర్

ఈస్ట్ కోస్ట్ రైల్వే జీఎం ఆకస్మిక పర్యటన

కొరాపుట్:

ఈస్ట్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వరన్ ఫంకువాల్ ఆకస్మికంగా పర్యటించారు. కొత్త వలస–కిరండోల్ మార్గంలో కొరాపుట్–కిరండోల్ (కేకే 2) లో విండో ఎల్‌జి స్పెషల్ రైలులో ప్రయాణం చేశారు. ఈ మార్గంలో రైల్వే స్థిరీకరణ, రైల్వే స్టేషన్లు పరిశీలించారు. విండో ప్రయాణంలో ట్రాక్స్, మలుపులు, వంతెనలు, గుహల గుండా పర్యవేక్షించారు. ఇటీవల కొండ చరియలు ట్రాక్ మీదకు దూసుకు వచ్చిన జరతి–మాలిగుడ స్టేషన్ల మధ్య ట్రాక్ పరిశీలించారు. కొండ చరియలు పడినప్పుడు తట్టుకునే విధంగా ట్రాక్‌ల సామర్థ్యాన్ని పరీక్షించారు. ఇదే మార్గంలో కొరాపుట్ మీదుగా జగదల్‌పూర్ మార్గం పరిశీలించారు. తిరిగి కొరాపుట్–రాయగడ మార్గం కేఆర్ లైన్‌లో పరిస్థితి సమీక్షించారు. కక్కిరి గుమ్మ రైల్వే స్టేషన్, లైలి గుమ్మ–రవులి మధ్య వంతెన, కేఆర్ లైన్ లో 15 గేట్ లెవల్ క్రాసింగ్ పరిశీలించారు. పలు చోట్ల స్టేషన్లు తనిఖీ చేశారు. భారీ వర్షం పడుతున్నప్పటికీ గొడుగులు వేసుకొని ట్రాక్‌ల వద్దకు వెళ్లారు. విధి నిర్వహణలో ఉన్న సిబ్బందితో మాట్లాడారు. పర్యటనలో వాల్తేర్ డీఆర్ఎం లలిత్ బోరా, అన్ని విభాగాల సాంకేతిక నిపుణులు పాల్గొన్నారు.



ట్రాక్‌ల వద్ద సిబ్బందితో పరిస్థితి సమీక్షిస్తున్న ఈస్ట్‌కోస్ట్ జీఎం పరమేశ్వర్ ఫంకువాల్



భారీ వర్షంలో స్వయంగా వంతెనల ఫొటోలు తీస్తున్న జీఎం



ట్రాక్‌ల వద్ద సిబ్బంది తో మాట్లాడుతూ..



స్టేషన్లలో సిబ్బంది నుంచి వివరాలు సేకరిస్తూ..

క్లుప్తంగా

చుక్కల్ని తాకిన కాయగూరల ధరలు

భువనేశ్వర్: రాష్ట్రంలో ప్రముఖ కూరగాయల హోల్ సేల్ అంగడి కటక్ ఛత్రబజార్‌లో నిత్య అవసర కాయగూరల ధరలు గణనీయంగా పెరిగాయి. వినియోగదారులు సతమతం అవుతున్నారు.

గురువారం నాటికి ఈ అంగడిలో పలు కాయగూరల కిలో ధరలు (రూ.)

బంగాళాదుంపలు 20	బెండకాయలు 40
ఉల్లిపాయలు 25	బరబటీలు 30
దోసకాయలు 20	వంకాయలు 70
పొటల్స్ 30	క్యారెట్ 30

ప్రభుత్వానికి లొంగిపొండి

- మీ కుటుంబాలను అన్ని విధాలా ఆదుకుంటాం
- మావోయిస్టులకు పోలీసు యంత్రాంగం పిలుపు



మునిగుడలో గల బస్టాండు వద్ద పోలీసులు ఏర్పాటు చేసిన బ్యానరు

రాయగడ: ఆయుధాలను వీడి మీరంతా ప్రభుత్వానికి లొంగిపోవాలని, కుటుంబ సభ్యులకు అన్ని విధాలా ఆదుకుంటామని జిల్లా పోలీస్ యంత్రాంగం జిల్లాలోని మునిగుడ పోలీస్ స్టేషన్, బస్టాండు తదితర ప్రాంతాల్లో బ్యానర్లను ఏర్పాటు చేసింది. గురువారం నాడు మునిగుడలో కనిపించిన ఈ బ్యానర్లు హల్‌చల్ సృష్టించాయి. మావోయిస్టులు లొంగిపోతే ప్రభుత్వం తరఫున ఉండేందుకు ఇల్లు, ఆర్థిక సాయంతో పాటు పిల్లల భవిష్యత్ కోసం ఆర్థిక సాయం చేస్తామన్నారు. అందువల్ల మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలిసిపోవాలని బ్యానర్లలో పేర్కొన్నారు.

అక్రమ అరెస్టులు ఆపాలి

శ్రీకాకుళం: సోషల్ మీడియాలో పోస్టులు చేస్తున్న వారిని అక్రమ అరెస్టులు చేస్తూ పౌరుల జీవనానికి, స్వేచ్ఛకు కూటమి ప్రభుత్వం భంగం కలిగిస్తోందని అంతర్జాతీయ మానవహక్కుల సంఘం స్టేట్ సివిల్ రైట్స్ చైర్మన్ కరణం తిరుపతి నాయుడు గురువారం తెలిపారు. సోషల్ మీడియా అరెస్టులపై సుప్రీం కోర్టు మార్గదర్శకాలు జారిచేసినా ప్రభుత్వం పాటించట్లేదన్నారు. జిల్లాలో మంత్రి అచ్చెన్నాయుడు అరాచకాలు ఎక్కువయ్యాయని, ప్రతిపక్షాలపై తప్పుడు ఆరోపణలు, తప్పుడు కేసులు బనాయించి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అక్రమ అరెస్టులను ఆపాలని డిమాండ్ చేశారు.

రెండు లారీలు ఢీ

రణస్థలం: పతివాడపాలెంలో జాతీయ రహదారిపై రెండు లారీలు ఢీకొట్టుకున్నట్లు జె.ఆర్.పురం పోలీసులు తెలిపారు. విశాఖపట్నం వైపు నుంచి శ్రీకాకుళం వైపు ముందు వెళుతున్న లారీని వెనుక నుంచి వస్తున్న మరో లారీ బలంగా ఢీకొట్టింది. గురువారం తెల్లవారుజామున జరిగిన ఈ ప్రమాదంలో క్లీనర్, డ్రైవర్లు స్వల్పగాయాలతో బయటపడ్డారని జె.ఆర్.పురం ఎస్సై ఎస్.చిరంజీవి తెలిపారు. హైవే పెట్రోలింగ్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని లారీని క్రేన్ సహాయంతో పక్కకు తొలగించారు.

డిజిగ్నేషన్ మార్చాలని వినతి

ఎచ్చెర్ల: తమకు గెస్ట్ ఫ్యాకల్టీ పేరిట డిజిగ్నేషన్ ఇచ్చి అన్యాయం చేశారని, తమ డిజిగ్నేషన్‌ను కాంట్రాక్ట్ లెక్చరర్, అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా మార్చాలని కాంట్రాక్ట్ గెస్ట్ లెక్చరర్లు రెడ్డి లక్ష్మణరావు, వై.నారాయణరావు, పి.నవీన్ కోరారు. ఈ మేరకు గురువారం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఐఐఐటీ) డైరెక్టర్ కేవీజీడీ బాలాజీకు వినతిపత్రం అందించారు. 2018కి ముందు, తర్వాత రిక్రూట్‌మెంట్ అయినవారికి రూ.40 వేలు జీతం ఇస్తున్నామ, తమకు మాత్రం రూ.25 వేలకే పరిమితం చేశారన్నారు. ఈ విషయమై అనేక సార్లు వినతిపత్రం అందించినా ఇప్పటివరకూ న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను చాన్సలర్ మధుమూర్తి, రిజిస్ట్రార్ అమరేంద్రల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని వారు కోరారు.

గిరి ప్రదర్శనకు వెళ్లి వస్తూ..

నరసన్నపేట: మాకివలసలో గ్రామానికి చెందిన రావాడ ఉదయకుమార్ (28) రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. గురువారం సింహాచలం గిరి ప్రదర్శనకు వెళ్లి ద్విచక్ర వాహనంపై తిరిగి స్వగ్రామం వస్తుండగా భోగాపురం వద్ద అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టాడు. ఈ ఘటనలో ఉదయకుమార్ అక్కడికక్కడే మృతిచెందగా మరొకరికి గాయాలయ్యాయి. విషయం తెలియడంతో తండ్రి రమణయ్య, కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఉదయ్‌కుమార్ డిగ్రీ పూర్తి చేసి ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్నాడు. ఇంతలోలో మృతి చెందడంతో అందరూ విషాదంలో మునిగిపోయారు.

పీ-4 విధానంపై సమీక్ష

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో పీ4 (ప్రభుత్వం-ప్రైవేటు-ప్రజలు- భాగస్వామ్యం) కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు గురువారం ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి విజయానంద్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, అసిస్టెంట్ కలెక్టర్ దొనక పథ్విరాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తగ్గేది లేదు: డ్రైవర్లు

- భయపడాల్సింది లేదు: ప్రభుత్వం



పెట్రోలు కోసం బంకుల దగ్గర బారులు తీరిన వినియోగదారులు



నడి రోడ్డు మీద డ్రైవర్ల గర్జన

భువనేశ్వర్: అఖిల ఒడిశా రోడ్డు రవాణా డ్రైవర్ల సంఘం స్టీరింగు విరమణ ఆందోళన ఉధృతం చేస్తున్నారు. ప్రభుత్వ స్పందనని బహిరంగంగా ఆందోళనకారుల మధ్య ప్రకటించి లిఖిత హామీ పత్రం విడుదల చేయాలని గట్టిగా పట్టుబట్టారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించేంత వరకు ఏమాత్రం తగ్గకుండా స్టీరింగు విరమణ ఆందోళన నిరవధికంగా కొనసాగుతుందని తెలిపారు. అయితే రాష్ట్రంలో డ్రైవర్ల ఆందోళనపట్ల ఏమాత్రం ఆందోళన చెందాల్సింది లేదని రాష్ట్ర ఆహార సరఫరా, వినియోగదారుల సంక్షేమ శాఖ మంత్రి కృష్ణ చంద్ర పాత్రో పూర్తి అభయం ఇచ్చారు. ఈ రెండు వర్గాల మధ్య సాధారణ ప్రజానీకం, వినియోగదారుల వర్గం తల్లడిల్లుతుంది. ప్రధానంగా డ్రైవర్ల బంద్ ప్రభావంతో రాష్ట్రంలో పెట్రోలు, డీజిల్ వంటి చమురు సంక్షోభం తాండవిస్తుందని సర్వత్రా భయాందోళనలు వ్యక్తం అవుతున్నాయి. ప్రస్తుతానికి రాష్ట్రంలో చమురు కొరత లేదని మంత్రి ప్రకటించారు. డ్రైవర్ల ఆందోళన కొనసాగుతున్న పెట్రోల్, డీజిల్ నిల్వ పుష్కలంగా ఉంది. అధికారులతో చర్చలు జరుగుతున్నాయి. బుధవారం నగరానికి 150 ట్యాంకర్లు, కటక్‌కు 76 ట్యాంకర్లతో పెట్రోల్, డీజిల్ చేరినట్లు మంత్రి వివరించారు. అన్ని నగరాల్లోనూ చమురు అందుబాటులో ఉంది. భయపడాల్సిన అవసరం లేదని తెలిపారు.



పెట్రోలియం డీలర్ల సంఘం ప్రతినిధులతో మంత్రి సమావేశం



సంజయ్ లాట్, డీజిల్, పెట్రోలియం డీలర్ల సంఘం ప్రధాన కార్యదర్శి

పెట్రోలియం డీలర్ల సంఘం ప్రతినిధులతో మంత్రి సమావేశం

అఖిల ఒడిశా రోడ్డు రవాణా డ్రైవర్ల సంఘం నిరవధిక సమ్మెతో రాష్ట్రంలో పెట్రోలియం సంక్షోభ పరిస్థితి మెల్లగా పుంజుకుంటోంది. ఈ పరిస్థితి నివారణ కోసం విభాగం మంత్రి పెట్రోలు, డీజిలు డీలర్ల సంఘం ప్రతినిధి ప్రముఖులతో మంత్రి గురు వారం సమావేశం అయ్యారు. స్థానిక లోక్ సేవా భవన్‌లో ఈ సమావేశం జరిగింది. సమావేశంలో సరఫరా శాఖ సీనియర్ అధికారులు పాల్గొన్నారు. అఖిల ఒడిశా డీజిలు. పెట్రోలియం డీలర్ల సంఘం ప్రధాన కార్యదర్శి సంజయ్ లాట్ హాజరయ్యారు. రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ సరఫరా, తాజా నిల్వల పరిస్థితిపై వీరంతా చర్చించారు.

రాష్ట్రానికి రోజుకు 36 లక్షల లీటర్ల పెట్రోల్, 85 లక్షల లీటర్ల డీజిల్ అవసరం. సాధారణంగా పెట్రోల్ పంపులలో 4 రెట్లు చమురు నిల్వ చేస్తున్నారు. డ్రైవర్ల ఆందోళన ప్రభావంతో గత 2 రోజులుగా పెట్రోలు, డీజిలు రవాణా స్తంభించిపోయింది. దీంతో సాధారణ నిల్వ క్రమంగా అడుగంటిపోతుందని అఖిల ఒడిశా డీజిలు, పెట్రోలియం సంఘం ప్రధాన కార్యదర్శి సంజయ్ లాట్ వివరించారు. ఇది క్రమంగా చమురు సంక్షోభానికి దారి తీసే ప్రమాదం పొంచి ఉందన్నారు.

ప్రస్తుతానికి పెట్రోలు, డీజిలు చమురు కొరత లేదు. గురువారం నాటికి చమురు సరఫరా కాకుంటే సంక్షోభం తలెత్తవచ్చు. ఇదే పరిస్థితి కొనసాగితే శుక్రవారం సాయంత్రం నాటికి పెట్రోల్ పంపుల్లో చమురు నిల్వలు అడుగంటిపోతాయని విశ్లేషించారు.

భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి



కొరాపుట్: నబరంగ్‌పూర్‌లో అలేఖ్ బాబా గురువు ఆశీర్వాదం తీసుకుంటున్న మంత్రి నిత్యానంద గోండొ



జయపురం: సాయిబాబా విగ్రహానికి పూజలు చేస్తున్న కొట్‌పాడ్ ఎమ్మెల్యే రూపు భొత్ర



రాయగడ: హోమంలో పాల్గొన్న భక్తులు

జయపురం: స్థానిక మహాత్మాగాంధీ రోడ్డులోని డెప్పిగుడ జంక్షన్‌లో గల సాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి పూజలు గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారి నుంచి భక్తులు సాయిబాబా ఆలయానికి తరలివచ్చారు. యజ్ఞ, యాగాలు నిర్వహించారు. కొట్‌పాడ్‌లోని సాయిబాబా విగ్రహానికి ఎమ్మెల్యే రూపు భొత్ర పూజలు చేశారు.

కొరాపుట్‌లో...

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలో రాష్ట్ర ప్రాథమిక విద్య, సాంఘిక సంక్షేమ, మైనారిటీ వ్యవహారాల మంత్రి నిత్యానంద గోండొ గురువారం పర్యటించారు. మెయిన్ రోడ్డులోని ఎస్‌బీఐ ఎదురుగా ఉన్న అలేఖ్ బాబా ఆశ్రమాన్ని సందర్శించారు. మత గురువు అవదూత బ్రహ్మచారి బాబాకి పాద నమస్కారం చేశారు. ఆశ్రమంలో మత పెద్దలకు కానుకలు సమర్పించారు. ఆశ్రమానికి అవసరమైన సహాయ, సహకారాలు అందజేస్తామని హామీ ఇచ్చారు. పక్కనే ఉన్న సాహిద్ లక్ష్మణ్ నాయక్ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. విద్యార్థుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి గురువుగా మారి పిల్లలకు పాఠాలు చెప్పారు. వారితో కలిసి ఆటలాడారు. నబరంగ్‌పూర్ ఎమ్మెల్యే గౌరీ శంకర్ మజ్జి ఉన్నారు. కొరాపుట్ జిల్లాలోని హరే కృష్ణ మందిరాన్ని కొట్‌పాడ్ ఎమ్మెల్యే రుపు భొత్ర సందర్శించారు. గురువుల ఆశీర్వాదం తీసుకున్నారు.

నబరంగ్‌పూర్‌లో..

నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని చైనా మార్కెట్‌లో షిర్డీ సాయి మందిరంలో గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించారు. ఉదయం పాలభిషేకం చేశారు. భక్తులకు ఉచిత అన్నప్రసాద సేవనం జరిగింది. సాయంత్రం చైనా మార్కెట్, పఠాన్ వీధి, గాంధీ జంక్షన్, మెయిన్ రోడ్డు, జగన్నాథ మందిరం మీదుగా స్వామిని ఊరేగించారు. రాత్రి అల్పాహారం పంపిణీ చేశారు. కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రాయగడలో..

రాయగడ: పట్టణంలోని షిర్డీ సాయి మందిరాల్లో గురుపౌర్ణమి పూజలు నిర్వహించారు. స్థానిక రైల్వే రిక్రియేషన్ మైదానం ఎదురుగా గల షిర్డీ సాయి బాబా మందిరంలో అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. డైలీ మార్కెట్ సమీపంలో గల హనుమాన్ మందిరం ప్రాంగణంలో గల బాబా మందిరంలో విశేష పూజలు నిర్వహించారు.

పర్లాకిమిడిలో...

పర్లాకిమిడి: వ్యాస పౌర్ణమి సందర్భంగా స్థానిక సరస్వతీ శిశు విద్యామందిర్‌లో విద్యార్థులతో దేవీ మఠం మహంత రామానంద మహారాజ్ పాల్గొని వ్యాసుని చరిత్ర గురించి తెలియజేశారు. వ్యాస మహర్షిని ఆదిగురువుగా పండితులు అందరూ కొనియాడతారన్నారు. అందువల్ల ఈ రోజు గురు పౌర్ణమి అని కూడా పిలుస్తారన్నారు. రాజవీధిలోని జగన్నాథ మందిరం వెలుపల రథాల వద్ద సరస్వతీ శిశు విద్యామందిర్ విద్యార్థులు హల్వా ప్రసాదాన్ని యాత్రికులకు పంచి పెట్టారు. శ్రీకృష్ణచంద్రగజపతి కళాశాల యోగా వేదికపై పతంజలి యోగా సమితి గురువు జిల్లా ప్రభారి భిక్షుశ్వర్ దాస్‌ను యోగ సమితి శిష్య బృందాన్ని ఘనంగా సత్కరించారు.



జయపురం: యజ్ఞం చేస్తున్న భక్తులు



కొరాపుట్: నబరంగ్‌పూర్‌లో పాఠాలు చెబుతున్న మంత్రి నిత్యానంద గోండొ



కొరాపుట్: చైనా మార్కెట్‌లోని షిర్డీ సాయి విగ్రహం వద్ద గురుపౌర్ణమి వేడుకలు



జయపురం: బాబా మందిరంలో బారులు తీరిన భక్తులు



జయపురం: దీపారాధన చేస్తున్న భక్తులు



రాయగడ: రైల్వే రిక్రియేషన్ వద్ద గల బాబా మందిరంలో ప్రత్యేక పూజలు



రాయగడ: బాబాకు పాలాభిషేకాలు నిర్వహిస్తున్న దృశ్యం



కొరాపుట్: కొట్‌పాడ్‌లో హరేకృష్ణ ఆశ్రమంలో ఆశీర్వాదం తీసుకుంటున్న ఎమ్మెల్యే రుపు భొత్ర



పర్లాకిమిడి: ఎస్.కె.సి.జి కళాశాలలో గురు పౌర్ణమి వేడుకలు



యోగా చేస్తున్న దృశ్యం

మజ్జిగ, పులిహోరా ప్యాకెట్ల పంపిణీ



సేవా కార్యక్రమంలో పాల్గొన్న నెక్కంటి భాస్కరరావు



మిరియాల పాలను భక్తులకు అందజేస్తున్న దృశ్యం

రాయగడ: ప్రముఖ పుణ్యక్షేత్రం సింహాచలంలో గిరి ప్రదర్శనకు తరలివచ్చిన భక్తులకు రాజ్యసభ మాజీ ఎంపీ, బీజేడీ జిల్లా అధ్యక్షుడు నెక్కంటి భాస్కరరావు నేతృత్వంలో వివిధ సేవా కార్యక్రమాలను బుధవారం నిర్వహించారు. ప్రత్యేకంగా సింహాచలం దేవస్థానం సమీపంలో కౌంటర్‌ను ఏర్పాటు చేసి భక్తులకు మజ్జిగ, మిరియాల పాలు, తాగునీరు, పులిహోరా ప్యాకెట్లు పంపిణీ చేశారు. ప్రతీ ఏడాది ఇటువంటి సేవా కార్యక్రమాలను గిరిప్రదర్శన సమయంలో నిర్వహిస్తున్నట్లు నెక్కంటి తెలిపారు.



మజ్జిగ తాగుతున్న భక్తులు

‘బీజేపీ ఎమ్మెల్యేను అరెస్టు చేయాలి’



బిజు జనతాదళ్ మహిళా నాయకుల ఆందోళన

భువనేశ్వర్: రాష్ట్రంలో అధికార భారతీయ జనతా పార్టీ, విపక్ష బిజూ జనతా దళ్ మధ్య రోజుకో వివాదం సంచలనం రేపుతోంది. బీజేపీ సిట్టింగ్ ఎమ్మెల్యే సంతోష్ ఖటువాను వెంటనే అరెస్టు చేయాలని విపక్ష బీజేపీ మహిళా నాయకులు వీధికి ఎక్కారు. నగరంలో నడి రోడ్డు మీద గురువారం భారీ ధర్నా నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యేని అరెస్టు చేసేందుకు సాక్ష్యాధారాలతో కూడిన ఫిర్యాదుని రాష్ట్ర పోలీసు డైరెక్టరు జనరలక్ యోగేష్ బహదూర్ ఖురానియాకు ఆందోళనకారుల ప్రతినిధి బృందం అందజేసింది. వివాదాస్పద ఎమ్మెల్యే సాక్ష్యాధారాలు తారుమారు చేయకుండా కస్టడీ విచారణ చేపట్టాలని డిమాండ్ చేవారు.

ఎమ్మెల్యే వ్యతిరేకంగా వన్యప్రాణుల (ఏనుగులు) వేట, లైంగిక వేధింపులు వంటి తీవ్రమైన ఆరోపణలపై సమగ్ర దర్యాప్తు చేయాలని ప్రతినిధి బృందం డీజీపీని అభ్యర్థించింది. ఆయన వ్యతిరేకంగా పలు పత్రికల్లో ప్రచురిత వార్త కాపీలు, ఆడియో క్లిప్‌లు మరియు తెలిపాల్ గ్రామంలో వన్య ప్రాణుల అక్రమ వేట, దంతాల అక్రమ రవాణా సంబంధిత సాక్ష్యాల్ని డీజీపీకి దాఖలు చేశారు.

ఈ నెల 2న ఎమ్మెల్యే ఫామ్‌హౌస్‌లో మీడియాతో జరిగిన సంభాషణలో బిజూ జనతా దళ్ నాయకురాలు డాక్టర్ లేఖశ్రీ సామంత సింఘార్ తనను వేశ్యగా అభివర్ణించి, సెక్స్ రాకెట్ నడిపారని సంతోష్ ఖటువా చేసిన అసభ్యకరమైన, లైంగికపరమైన, పరువు నష్టం కలిగించే వ్యాఖ్యలను డీజీపీకి దాఖలు చేసిన ఫిర్యాదులో సవివరంగా వివరించారు. ఈ అభ్యంతరకర చేష్టలతో తీవ్ర మానసిక వేదన మరియు ప్రతిష్ఠకు హాని కలుగుతుందని ప్రభావిత డాక్టర్ లేఖశ్రీ సామంత సింఘార్ ఆవేదన వ్యక్తం చేశారు. బెదిరింపులు, ప్రతీకార చర్యల ప్రమాదం దృష్ట్యా డాక్టర్ లేఖశ్రీ సామంత సింఘార్ ఆమెతో కుటుంబానికి పోలీసు రక్షణ కల్పించాలని కోరారు.



రాష్ట్ర డీజీపీకి ఫిర్యాదు దాఖలు చేసిన మహిళా నాయకులు

చోరీ ముఠా అరెస్ట్

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా బలిమెల పట్టణం 2వ వార్డులో గదబాగూడ వీధిలో నివసిస్తున్న సురి ప్రకాష్ ఇంటిలో జూన్ 5వ తేదీన చోరీ జరిగింది. ఊరు నుంచి వచ్చి చూస్తే ఇంటి తాళం విరిగి ఉంది. ఇంటిలో ఉన్న ఎలక్ట్రానిక్ వస్తువులు మొత్తం దొంగలించారు. వెంటనే బలిమెల పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఐఐసీ ధీరజ్ పట్నాయక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బుధవారం రాత్రి అనుమానంగా తిరుగుతున్న కొంతమంది వ్యక్తులను పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా దొంతనం చేసినట్లు అంగీకరించారు. గదబగూడ వీధికు చెందిన దేవరాజ్ సురజా, మెడికల్ వీధికి చెందిన దిలిప్ నాగ్‌గా గుర్తించారు. వస్తువులు కొనుగోలు చేసిన రుపేష్ బాఘ్‌తోపాటు వీరి ముగ్గురిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు. గురువారం వారు దొంగలించిన వస్తువులను స్వాధీనం చేసుకుని కోర్టుకు తరలించామని ఐఐసీ తెలిపారు.



నిందితుల వద్ద స్వాధీనం చేసుకున్న ఎలక్ట్రికల్ వస్తువులు

క్లుప్తంగా

గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయకపోవడం విచారకరం



విజయనగరం టౌన్: కేంద్ర కేబినెట్, రైల్వే మంత్రిత్వ శాఖ ఆమోదం తెలిపి ఆరేళ్లు అయినా ఇంతవరకు విశాఖ కేంద్రంగా సౌత్‌కోస్ట్ రైల్వే గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయకపోవడం విచారకరమని సౌత్‌కోస్ట్ రైల్వే మజ్దూర్ యూనియన్ జనరల్ సెక్రటరీ చోడవరపు శంకరరావు ఓ ప్రకటనలో అన్నారు. నోటిఫికేషన్ విడుదలైతే రైల్వేజోన్ తన కార్యక్రమాలు ప్రారంభించాల్సి ఉంటుందని, ఇప్పటికీ రైల్వే మంత్రిత్వ శాఖ నుంచి ఎటువంటి ఉత్తర్వులు రాలేదన్నారు. దీంతో విజయవాడ, గుంతకల్, గుంటూరు డివిజన్‌లపై పర్యవేక్షించే అధికారం లేకపోయిందన్నారు. ప్రధాని మోదీ చొరవ తీసుకుని, రైల్వేజోన్‌కు సంబంధించి గెజిట్ నోటిఫికేషన్ ఉత్తర్వులు వెలువడేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. కనీసం ఆగస్టు 15 నాటికి అయినా కొత్త సౌత్‌కోస్ట్ రైల్వే జోన్ తన పరిపాలన ప్రారంభించేలా స్థానిక ప్రజాప్రతినిధులు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.

సాలూరులో అగ్నిప్రమాదం



దగ్ధమైపోతున్న వస్తువులు, సామగ్రి

సాలూరు: పట్టణంలోని పెదహరిజనపేటలో గురువారం అగ్నిప్రమాదం సంభవించింది. దీనిపై ఫైర్ అధికారి రాజారావు తెలిపిన వివరాల ప్రకారం, పెదహరిజనపేటలో నివాసముంటున్న బి.సురేష్ ఇంట్లోని మూడవ అంతస్తులో గురువారం సాయంత్రం గ్యాస్ లీకై మంటలు వ్యాపించాయి. దీంతో అక్కడ ఉన్న సామగ్రి, విలువైన సర్టిఫికెట్లు తదితర వస్తువులు దగ్ధమయ్యాయి. ఈ సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి వెళ్లి మంటలను అదుపుచేశారు. సుమారు రూ.2లక్షల వరకు ఆస్తినష్టం జరిగి ఉండవచ్చని అధికారులు అంచనా.

యువకుడి దుర్మరణం



ఉదయ్ మృతదేహం

భోగాపురం: మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై గురువారం రోడ్డు ప్రమాదం జరగ్గా ఓ యువకుడు దుర్మరణం చెందాడు. ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. సింహాచలంలో గిరిప్రదక్షిణకు హాజరూ ద్విచక్రవాహనంపై మితిమీరిన వేగంతో దూసుకువచ్చిన యువకుడు జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న విద్యుత్ పోల్‌ను బలంగా ఢీకొట్టాడు. దీంతో ఈ ప్రమాదంలో శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట మండలంలోని మారికవలస గ్రామానికి చెందిన రావాడ ఉదయ్(28) అక్కడికక్కడే మృతిచెందాడు. బైక్‌పై వెనుక కూర్చున్న స్నేహితుడు చిన్నారావు తీవ్రంగా గాయపడగా చికిత్స నిమిత్తం తగరపువలస ఎన్ఆర్ఐ ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ దుర్గాప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం సుందరపేట సీహెచ్‌సీకి తరలించారు.

వసతిగృహం ఆకస్మిక తనిఖీ



విద్యార్థుల భోజనాన్ని పరిశీలిస్తున్న డీడీ అన్నపూర్ణ


గంట్యాడ: మండల కేంద్రంలో ఉన్న సాంఘిక సంక్షేమశాఖ బాలుర వసతి గృహాన్ని సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ అన్నపూర్ణ గురువారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మమేకమై పలువిషయాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని మంచి భవిష్యత్తు సాధించాలని సూచించారు. అ తర్వాత విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో వసతిగృహ సంక్షేమ అధికారి గొర్లె గోవింద సన్యాసిరావు పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వం ప్రజలకు చేరువకావాలి

విజయనగరం లీగల్: మధ్యవర్తిత్వం ప్రజలకు మరింత చేరువకావాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ అధ్యక్షులు ఎం.బబిత అన్నారు. మధ్యవర్తిత్వంపై శిక్షణ పొందిన న్యాయవాదులకు గురువారం ఒక రోజు వర్క్‌షాప్, ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ మధ్యవర్తిత్వం చాలా సులువైనది, ఖర్చులేనిదన్నారు. ఈ బృహత్తర కార్యక్రమం దేశవ్యాప్తంగా 90 రోజులు పాటు నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. శిక్షణలో భాగంగా కేరళ రాష్ట్రం నుంచి ఇద్దరు మాస్టర్ ట్రైనీ మీడియేటర్స్ వచ్చి న్యాయవాదులందరికీ శిక్షణ అందిస్తున్నారన్నారు. ఈ స్టాల్ జిల్లా కోర్టు ఆవరణలో ఈ రోజు నుంచి పదిరోజుల పాటు ప్యానల్ లాయర్స్, పారాలీగల్ వలంటీర్స్ నిర్వహిస్తున్నారని, వారు ప్రజలకు మధ్యవర్తిత్వంపై అవగాహన కల్పిస్తారన్నారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఎ.కృష్ణప్రసాద్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కలిశెట్టి రవిబాబు, ఇతర న్యాయవాదులు పాల్గొన్నారు.

అక్కరకు రాని జీసీపీఎస్..!

- బాలికలకు 20 ఏళ్లు నిండినా అందని డబ్బులు
- వేలాది మంది ఎదురుచూపులు
- ఇద్దరు ఆడపిల్లలు అయితే రూ.60వేలు ఇవ్వాలి
- ఒక ఆడపిల్ల అయితే రూ.లక్ష అందాలి
- గడువు దాటినా డబ్బులు రాకపోవడంతో ఆవేదన చెందుతున్న లబ్ధిదారులు



జీసీపీఎస్ పథకం కోసం వైదేహి చేసుకున్న దరఖాస్తు ఫారం



బాలిక సంరక్షణ పథకం బాండు

విజయనగరం ఫోర్ట్: ఈ ఫొటోలో కనిపిస్తున్న బాలిక పేరు జాగరపు వైదేహి. 2002లో జన్మించింది. ఈమెది విజయనగరంలోని బొబ్బాది పేట ప్రాంతం. ఆదిలక్ష్మి, స్వామినాయుడుల ఏకైక సంతానం. ఒక ఆడపిల్లతో వీరు కుటుంబ సంక్షేమ శస్త్రచికిత్స చేసుకున్నారు. బాలికా సంరక్షణ పథకం (జీసీపీఎస్) పథకం కోసం దరఖాస్తు చేయగా వారికి పథకానికి సంబంధించిన బాండు కూడా ఇచ్చారు. 20 ఏళ్లు నిండిన తర్వాత ఈమెకు రూ.లక్ష అందాలి. ప్రస్తుతం ఈమెకు 23 ఏళ్లు వచ్చాయి. అయినా డబ్బులు అందలేదు. ఐసీడీఎస్ అధికారులను అడిగినా స్పష్టమైన సమాధానం చెప్పడం లేదని వైదేహి తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇలా ఈమె ఒక్కరే కాదు. అనేక మంది జీసీపీఎస్ ద్వారా ఇచ్చే ప్రోత్సాహకం కోసం జిల్లా వ్యాప్తంగా వేలాది మంది ఎదురుచూస్తున్నారు. కొంతమందికి వివాహాలు కూడా జరిగిపోయాయి. ఇంకొంతమంది ఆ డబ్బులు వస్తే వివాహం చేయాలని చూస్తున్నారు. ఈ పథకం కోసం పేదవర్గాలకు చెందిన వారే అధికశాతం మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పుడు వారంతా పథకం లబ్ధికోసం నిరీక్షిస్తున్నారు. ఆడపిల్లలను కన్నవారిని ప్రోత్సహించడం కోసం బాలికా సంరక్షణ పథకాన్ని అప్పట్లో ప్రవేశ పెట్టారు. ఒక ఆడపిల్ల అయితే రూ.లక్ష, ఇద్దరు ఆడపిల్లలైతే రూ.60 వేలు (ఒక్కో ఆడపిల్లకు రూ.30 వేలు చొప్పన) బాలికకు 20 ఏళ్లు నిండిన తర్వాత అందివ్వాలన్నది పథకం ఉద్దేశ్యం.

పథకానికి అర్హతలు:

- జీసీపీఎస్ (బాలికా సంరక్షణ పథకం) ఒకరు, లేదా ఇద్దరు ఆడపిల్లలు ఉన్న వారు అర్హులు.
- కుటుంబం మొత్తం వార్షిక ఆదాయం రూ.90 వేల లోపు ఉన్నవారు
- ఒక ఆడపిల్ల అయితే రూ.లక్ష అందజేస్తారు.
- ఇద్దరు ఆడపిల్లలైతే రూ. 60 వేలు ఇస్తారు.

వేలాది మంది ఎదురుచూపులు:

బాలికా సంరక్షణ పథకం నిబంధనల ప్రకారం జిల్లాలో చాలా మంది బాలికలకు 20 ఏళ్లు నిండాయి. వారందరికీ ప్రభుత్వం డబ్బులు అందజేయాలి. 20 ఏళ్లు నిండిన అమ్మాయిల తల్లిదండ్రులు సీడీపీఓ, పీడీ కార్యాలయాల్లో డబ్బుల గురించి అడిగినా అక్కడి అధికారులు స్పష్టత ఇవ్వడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉమ్మడి విజయనగరం జిల్లాలో 42,980 మంది జీసీపీఎస్ పథకానికి అర్హులున్నారు. వారిలో చాలా మందికి 20 ఏళ్లు నిండాయి. ఒక ఆడపిల్లకు రూ.లక్ష వస్తుందని తల్లిదండ్రులు గంపెడాశలు పెట్టుకున్నారు. పేదవారైతే వివాహ ఖర్చులకు సరిపోతాయిని ఆశించారు.

ప్రభుత్వం నోటీసులో ఉంది

బాలికా సంరక్షణ పథకానికి సంబంధించి 20 ఏళ్లు దాటిన వారికి డబ్బుల చెల్లింపు విషయం ప్రభుత్వం నోటీసులో ఉంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌గా ఉన్నప్పుడు ఈ పథకం అమలైంది. రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు దీనిపై చర్చిస్తున్నాయి. డబ్బుల చెల్లింపునకు సంబంధించి కొంత సమయం లబ్ధిదారులు వేచి ఉండాలి.

– తవిటినాయుడు, ఇన్‌చార్జి, పీడీ, ఐసీడీఎస్

సీజీఆర్‌ఎఫ్‌కు 43 వినతులు



సమావేశంలో మాట్లాడుతున్న సీజీఆర్ఎఫ్ చైర్మన్ సత్యనారాయణ

- వినతులకు 60 రోజుల్లో పరిష్కారం
- సమస్యల పరిష్కారానికి 1912 టోల్ ఫ్రీనంబర్
- చైర్మన్ డాక్టర్ బి.సత్యనారాయణ

వీరఘట్టం: విద్యుత్ సమస్యల పరిష్కారానికి 1912 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార న్యాయస్థానం చైర్మన్ డాక్టర్ బి.సత్యనారాయణ సూచించారు. ఈ మేరకు గురువారం వీరఘట్టం విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తమ సమస్యలు పరిష్కారించాలంటూ వినియోగదారులు 43 వినతులు అందజేశారు.

- హుస్సేనుపురం, మొట్టవెంకటా పురం, కిమ్మి గ్రామాల్లో లోఓల్టేజీ సమస్య వేధిస్తోందని పలువురు ఫిర్యాదు చేశారు.
- చిదిమిలో పాత విద్యుత్ స్తంభాలను మార్చాలని, ఇదే ఫీడర్‌లో ఏబీ స్విచ్‌లు లేక విద్యుత్ అంతరాయం ఎక్కువ అవుతోందని, వైర్లు పాతబడిపోవడంతో తరుచూ తెగిపోతున్నాయని ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు ఫిర్యాదు చేశారు.

60 రోజుల్లో పరిష్కారం..

విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదికకు వచ్చిన ఫిర్యాదులను 60 రోజుల్లో పరిష్కరిస్తామని చైర్మన్ బి.సత్యనారాయణ స్పష్టం చేశారు. కార్యక్రమంలో పరిష్కార వేదిక ఆర్థిక వ్యవహారాల సభ్యుడు ఎస్.సుబ్బారావు, సాంకేతిక నిపుణులు ఎస్.రాజబాబు, ఎన్.మురళీకృష్ణతో పాటు పార్వతీపురం మన్యం జిల్లా ట్రాన్స్‌కో ఎస్ఈ కె.మల్లికార్జునరావు, ఈఈ టెక్నికల్ డి.పురుషోత్తం, పాలకొండ డీఈ కె.విష్ణుమూర్తి, ఎ.డి మోహనచక్రవర్తి, వీరఘట్టం ఏఈ కె.అనిల్‌కుమార్‌తో పాటు సర్కిల్ పరిధిలో ఉన్న ట్రాన్స్‌కో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



గ్రామంలో విద్యుత్ సమస్యలు పరిష్కరించాలంటూ వినతిపత్రం ఇస్తున్న ఎంపీపీ దమలపాటి వెంకటరమణ నాయుడు

వృద్ధుడి ఆత్మహత్య

పార్వతీపురం రూరల్: జిల్లా కేంద్రంలోని బెలగాం సాయినగర్ కాలనీలో నివాసం ఉంటున్న వృద్ధుడు బాసూరి అమ్మాజీరావు(62) ఆర్థిక ఇబ్బందులు తాళలేక పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు పార్వతీపురం పట్టణ ఎస్సై గోవింద పేర్కొన్నారు. అమ్మాజీరావు కొమరాడ మండలంలో పోస్టల్‌శాఖలో పనిచేస్తూ ఇటీవల జనవరిలో ఉద్యోగ విరమణ పొందారని, మృతుడికి మగ్గురు కుమార్తెలు కావడంతో తమ దంపతులను చూసుకునేందుకు ఆధారం లేక ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతూ ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. వారి సమీపంలో ఉన్న కుమార్తె ఇంటికి గురువారం ఉదయం తన భార్య వెళ్లడంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగు మందు తాగి అమ్మాజీరావు ఆత్మహత్యకు పాల్పడినట్లు గుర్తించిన కుటుంబ సభ్యులు వెంటనే విజయనగరం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందినట్లు తెలిపారు.

అర్ధరాత్రి ఒడ్డుకు చేరిన మత్స్యకారులు



ఒడ్డుకుచేరిన మత్స్యకారులతో పోలీసులు

వంగర: మండల పరిధి మడ్డువలస గొర్లె శ్రీరాములునాయుడు ప్రాజెక్టులో చేపలవేటకు వెళ్లి గుర్రపు డెక్కలో చిక్కుకున్న తండ్రీ కొడుకులు దాసరి రాములు, ఆదినారాయణ బుధవారం అర్ధరాత్రి దాటిన తరువాత సురక్షితంగా ఒడ్డుకు చేరారు. గుర్రపు డెక్క తిప్పు కోవడంతో సుమారు 10 గంటల పాటు ప్రాజెక్టులోనే రక్షించాలంటూ ఆర్తనాదాలు చేశారు. వంగర పోలీసులు రంగప్రవేశం చేయడంతో సహచర మత్స్యకారులు పడవల్లో ప్రాజెక్టు లోపలికి వెళ్లి గాలింపు చేపట్టారు. చివరకు బుధవారం అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో అతికష్టంమీద తండ్రీ కొడుకులను ఒడ్డుకు చేర్చారు. దీంతో వారి కుటుంబ సభ్యులు, మత్స్యకారులు, అధికార యంత్రాంగం అంతా ఊపిరి పీల్చుకున్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఎస్ఈ

పార్వతీపురంటౌన్: ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈగా బుధవారం బాధ్యతలు స్వీకరించిన కె.మల్లిఖార్జున రెడ్డి గురువారం కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలో విద్యుత్ వ్యవస్థను పటిష్టం చేయాలని ఈ సందర్భంగా ఎస్ఈకి కలెక్టర్ సూచించారు.

12న రాష్ట్ర స్థాయి సమావేశం

పాలకొండ రూరల్: ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ ఉపాధ్యాయుల వెల్ఫేర్ అసోసియేషన్ నేతృత్వంలో గుంటూరు తాడేపల్లి పరిధి సీఎస్ఆర్ కళ్యాణ మండపంలో ఈ నెల 12 రాష్ట్ర స్థాయి సమావేశం జరగనుందని, ఉద్యోగులందరూ హాజరు కావాలని అసోసియేషన్ పార్వతీపురం జిల్లా అధ్యక్షుడు బోను మన్మథరావు మాదిగ గురువారం ఒక ప్రకటనలో కోరారు. వర్గీకరణ అనంతరం తొలి సమావేశం కావడంతో జిల్లా నుంచి పెద్ద ఎత్తున తాడేపల్లికి ఉద్యోగులు తరలి రావాలన్నారు. కార్యక్రమంలో భాగంగా ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ నేతృత్వంలో సమస్యలపై భవిష్యత్తు కార్యాచరణపై చర్చ ఉంటుందన్నారు. కార్యక్రమం ద్వారా ఐక్యత చాటాలని మాదిగ ఉద్యోగుల సమాఖ్య రాష్ట్ర నాయకులు అలజంగి చిన్నారావు, యామల సతీష్‌కుమార్ పిలుపునిచ్చారు.

ఎగువ సంకిలికి ఏనుగులు

సీతంపేట: మండలంలోని ఎగువ సంకిలి పరిసర ప్రాంతాల్లో గురువారం ఏనుగులు సంచరిస్తున్నట్టు గిరిజనులు తెలిపారు. గత వారం రోజులుగా చిన్నబగ్గ–గోరపాడు జీడితోటల్లో ఉన్న నాలుగు ఏనుగులు ఇప్పుడు ఎగువ సంకిలి పరిసరాల్లోకి చేరడంతో గిరిజనులు భయాందోళనలు చెందుతున్నారు. పైనాపిల్, అరటి, కొండచీపుర్ల పంటలు నాశనం చేస్తున్నాయంటూ రైతులు లబోదిబోమంటున్నారు. ఏనుగుల గమనాన్ని ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నట్టు ఎఫ్‌బీఓ కె.దాలినాయుడు తెలిపారు. ఏనుగులు సంచరించే వైపు ఎవ్వరూ వెళ్లవద్దని సూచనలిస్తున్నామన్నారు.

నగర శివార్లలో డ్రోన్లతో నిఘా



డ్రోన్లు నిర్వహిస్తున్న తీరును పరిశీలిస్తున్న రూరల్ సీఐ లక్ష్మణరావు

విజయనగరం క్రైమ్: నేరాల నియంత్రణలో భాగంగా నగర శివార్లల్లో డ్రోన్లతో నిఘా పెడుతున్నారు. ఇటీవల జరిగిన నేర సమీక్షలో ఎస్పీ ఆదేశాల మేరకు విజయనగరం రూరల్ పోలీసులు ఈ చర్యల్లో నిమగ్నమయ్యారు. ఈ మేరకు సున్నితమైన, మారుమూల ప్రదేశాలైన జమ్ము, నారాయణపురం, పడాలపేట, వైఎస్సార్ నగర్, ఫోర్ట్ సిటీ స్కూల్ వెనక ప్రాంతాల్లో డ్రోన్లతో నిఘాకు చర్యలు తీసుకున్నామని రూరల్ సీఐ లక్ష్మణరావు తెలిపారు. ప్రతిరోజూ ఈ డ్రోన్ల ద్వారా నిఘా ఉంటుందని, అనుమానాస్పద వ్యక్తుల సంచారం, అసాంఘిక కార్యాకలాపాలకు పాల్పడే వ్యక్తులపై ప్రత్యేక దృష్టి పెట్టడం జరుగుతుందని, తద్వారా నేరాలు తగ్గుముఖం పట్టే అవకాశం ఉందన్నారు.

రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలకు జిల్లా క్రీడాకారులు



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన బాక్సర్లు

- ఈనెల 12 నుంచి విశాఖలో పోటీలు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న సబ్ జూనియర్స్ బాల బాలికల బాక్సింగ్ పోటీల్లో పాల్గొనే జిల్లా క్రీడాకారుల ఎంపిక పూర్తయింది. ఈ నెల 12, 13వ తేదీల్లో విశాఖపట్నంలోని రైల్వే స్టేడియంలో జరిగే 6వ రాష్ట్ర సబ్ జూనియర్ పోటీల్లో పాల్గొనే జిల్లా క్రీడాకారుల వివరాలు జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ప్రతినిధులు గురువారం వెల్లడించారు. బాలుర విభాగంలో ఎ.మనీష్, ఎస్.విశాల్, పి. దుర్గాప్రసాద్, కె.హేమేష్ వర్ధన్, కె.కత్యేష్ వర్ధన్, ఎ.యశ్వంత్, వై.రేవంత్, కె.గౌతమ్ గణేష్, బి.సచిన్‌లు ఉన్నారు. అదేవిధంగా బాలికల విభాగంలో బి.మైథిలి, ఎం.ఝాన్సీ, ఎస్.దేవిక, కె.వేణుమాధవి, వి.జాహ్నవి లు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు జిల్లా జట్లకు అర్హత సాధించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలవడంతో పాటు జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించాలని రాష్ట్ర బాక్సింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు డోల మన్మథ కుమార్ ప్రోత్సహించారు. కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్, కార్యదర్శి ఇందుకూరి అశోక్‌రాజు, శాప్ బాక్సింగ్ కోచ్ బి.ఈశ్వరరావులు క్రీడాకారులను అభినందించారు.

చోరీకేసులో నిందితుల అరెస్ట్



విలేకరులతో మాట్లాడుతున్న సీఐ రమణ తదితరులు, వెనుక ముసుగుల్లో నిందితులు

గజపతినగరం రూరల్: ఈనెల1వ తేదీన రైల్వేకాలనీలోని పొంద్రంకి గణేష్ ఇంట్లో జరిగిన చోరీకేసులో నలుగురు నిందితులను అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేసినట్లు గజపతినగరం సీఐ రమణ తెలిపారు. ఈ మేరకు గురువారం సాయంత్రం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గురువారం మధ్యాహ్నం రైల్వేస్టేషన్ ఏరియాలో అనుమానాస్పదంగా కొంతమంది వ్యక్తులు తిరుగుతున్నారని వచ్చిన సమాచారం మేరకు వారిని పట్టుకుని విచారణ చేయగా కాలనీలో జరిగిన దొంగతనం తామే చేశామని ఒప్పుకున్నారని తెలిపారు. అలాగే అదేరోజు సాలూరులో కూడా ఓ ఇంటిలో దొంగతనం చేశామని అంగీకరించినట్లు చెప్పారు. దీంతో వారి నుంచి 200 గ్రాముల వెండి, రూ.1150 నగదు రికవరీ చేశామన్నారు. చోరీకి పాల్పడిన వారిలో గుంటూరు జిల్లాకు చెందిన చిల్లా సురేష్‌పై ఇప్పటికే 50కేసులు నమోదయ్యాయన్నారు. అలాగే విజయవాడకు చెందిన నాగవీరభాస్కరరావు, జల్లేపల్లి వెంకటేశ్వరరావు, దాసరి సుభాష్‌లపై కూడా కేసులు ఉన్నాయని, వారు నలుగురు ఒక కారులో మక్కువలోని శంబర గ్రామం వెళ్లారన్నారు. ఆ తరువాత అదే రోజు ఈ రెండు దొంగతనాలు చేసి గుంటూరు వెళ్లిపోయినట్లు చెప్పారు. ఈ కేసును ఛేదించిన ఎస్సై కిరణ్‌కుమార్‌తో పాటు సిబ్బందికి ఉన్నతాధికారులు అభినందనలు తెలియజేసినట్లు సీఐ తెలిపారు.

గుర్తు తెలియని వాహనాన్ని ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు



ప్రమాదానికి గురైన మోటార్ సైకిల్



గాయపడిన బాలిక లక్ష్మి

డెంకాడ: మండలంలోని విశాఖ–శ్రీకాకుళం జాతీయ రహదారిపై నాతవలస వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. విశాఖ నుంచి శ్రీకాకుళం వైపు వెళ్తున్న మోటార్ సైకిల్ ముందుగా వెళ్తున్న గుర్తు తెలియని వాహనాన్ని ఢీకొట్టినట్లు తెలుస్తోంది. దీంతో మోటార్ సైకిల్‌పై వెళ్తున్న కుప్పిలి కృష్ణ, సవర ముఖలింగం తీవ్రంగా గాయపడి, అపస్మారక స్థితిలో ఉన్నారని ఎస్సై ఎ.సన్యాసినాయుడు తెలిపారు. విజయనగరంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో బాధితులు చికిత్స పొందుతున్నట్లు చెప్పారు. గాయపడిన ఇద్దరు వ్యక్తులు అపస్మారక స్థితిలో ఉండడం వల్ల పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని ఎస్సై తెలిపారు.

స్కూటీ ఢీకొట్టి విద్యార్థినికి..

వీరఘట్టం: స్థానిక బాలికోన్నత పాఠశాలలో గురువారం జరిగిన మెగా పేరెంట్ టీచర్స్ డేకు వెళ్తున్న 8వ తరగతి విద్యార్థిని కరజాడ లక్ష్మికి రోడ్డు ప్రమాదంలో గాయాలయ్యాయి. హైస్కూల్ ఎదురుగా ఉన్న పాన్ షాపు వద్దకు చాకెట్లు కొనుగోలు చేసేందుకు రోడ్డు దాటి వెళ్తున్న విద్యార్థిని లక్ష్మిని ఎదురుగా స్కూటీతో వచ్చిన ఓ వ్యక్తి ఢీ కొట్టాడు. దీంతో జరిగిన ఈ ప్రమాదంలో లక్ష్మి కుడి కాలు విరిగినట్లు వైద్యులు నిర్ధారించారు. గాయపడిన లక్ష్మిని 108 వాహనంలో పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రమాద విషయం తెలిసిన వెంటనే తహసీల్దార్ ఏఎస్ కామేశ్వరరావు బాలికోన్నత పాఠశాలకు వెళ్లి గాయపడిన బాలిక, తల్లిదండ్రుల వివరాలను హెచ్‌ఎం కేపీ నాగమణిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం బాలిక తల్లిదండ్రులతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిపై వాకబు చేశారు.

విద్యార్థుల నిరీక్షణ

- డిగ్రీ ప్రవేశాలపై స్పష్టత ఇవ్వని ప్రభుత్వం
- రెండు నెలలుగా ఎదురుచూపులు
- నోటిఫికేషన్ జారీ చేయని ఉన్నత విద్యాశాఖ
- ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌పై లేని స్పష్టత



శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పార్వతీపురం

పార్వతీపురం టౌన్: డిగ్రీ మొదటి సంవత్సరం ప్రవేశాల కోసం విద్యార్థులు ఎదురుచూస్తున్నారు. ఇంటర్‌మీడియట్ పరీక్షా ఫలితాలు వెలువడి రెండు నెలలు గడుస్తున్నా డిగ్రీలో ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ చేయకపోవడంతో విద్యార్థుల్లో ఆందోళన నెలకొంది. అడ్మిషన్లు ఎప్పుడు ప్రారంభిస్తారో తెలియక విద్యార్థులు తమ సమీపంలో గల కళాశాలల చుట్టూ చక్కర్లు కొడుతున్నారు. ఇంజినీరింగ్ కోర్సుల్లో చేరికకు కౌన్సెలింగ్ మొదలైతే ఆ ప్రభావం సాధారణ డిగ్రీ కోర్సులు నిర్వహిస్తున్న కళాశాలపై పడుతుందని కళాశాలల యాజమాన్యాలు, అధ్యాపకులు ఆందోళన చెందుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఆరు ప్రభుత్వ, 8 ప్రైవేట్ కళాశాలలు ఉన్నాయి. వాటిలో ప్రవేశానికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విద్యార్థుల భవితను ఆలోచించి 2020–21 విద్యాసంవత్సరం నుంచి ఆన్‌లైన్ విధానాన్ని అమల్లోకి తీసుకువచ్చింది. ఫలితంగా విద్యార్థుల ప్రవేశాలకు మార్గం సుగమం చేసింది. గతంలో ప్రభుత్వ కళాశాలల్లో సీట్ల కోసం విద్యార్థులు వేచి చూడాల్సిన పరిస్థితి ఉండేది కాదు. ఆన్‌లైన్ విధానాన్ని తిరిగి అమలు చేయాలని విద్యావేత్తలు సూచిస్తున్నారు. డిగ్రీలో ఆన్‌లైన్ ప్రవేశాల కారణంగా విద్యార్థులు ఒత్తిడికి లోను కాకుండా ప్రవేశాలు పొందేవారు. విద్యార్థికి దగ్గరలో, ఇష్టమైన కళాశాల ఎంపిక సులభతరంగా ఉండేది.

సబ్జెక్టులపై తర్జన, భర్జన

డిగ్రీలో గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన సింగిల్ సబ్జెక్టు విధానాన్ని డబుల్ సబ్జెక్టుకు మార్చాలని ఉన్నత విద్యాశాఖ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అయితే దీనిపై తర్జన, భర్జనలు కొనసాగుతున్నాయి. డిగ్రీ ప్రవేశాలకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానాల్లో దేన్ని అనుసరించాలనే అంశంపై ఉన్నత విద్యాశాఖాధికారులు సరైన నిర్ణయానికి రాలేదు. జిల్లాలో 12680 మంది ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థుల్లో కొంతమంది డిగ్రీ ప్రవేశాలపై మొగ్గు చూపుతున్నారు. ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మా ప్రవేశ పరీక్షల్లో ఆశించిన ర్యాంకులు రాని విద్యార్థులు సాధారణ డిగ్రీ కోర్సుల వైపు మొగ్గుచూపుతుంటారు. జూలై మొదటి, రెండవ వారంలో ప్రవేశాలకు షెడ్యూల్ విడుదల కాకపోతే విద్యార్థుల్లో పలువురు ఇంజినీరింగ్ లేదా ఫార్మా కోర్సుల్లో చేరే అవకాశాలున్నాయని విద్యావేత్తలు చెబుతున్నారు. ఇంటర్ ఫలితాలు వెలువడిన వెంటనే డిగ్రీ ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేస్తే కళాశాలల్లో ఎక్కువ భర్తీ అయ్యే అవకాశం ఉంటుందని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.

షెడ్యూల్ ప్రకటించాలి

ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో విద్యార్థులు చేరేందుకు ప్రభుత్వం తక్షణమే షెడ్యూల్ విడుదల చేయాలి. ప్రభుత్వ కళాశాలల్లో షెడ్యూల్ విడుదల చేయకపోవడంవల్ల ప్రైవేట్ కళాశాలలు దరఖాస్తులను స్వీకరించే ప్రక్రియ చేపడుతున్నట్లు తెలుస్తోంది. దీనివల్ల ప్రభుత్వ కళాశాలలకు తీవ్రనష్టం జరుగుతుంది. ప్రభుత్వం స్పందించి విద్యార్థులకు న్యాయం చేసేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నాం.

– సింహాద్రి కిరణ్‌కుమార్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు